సంక్షేమ లబ్ధిపై సర్వత్రా సంతృప్తి


బాపిరాజుగూడెంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు


చేబ్రోలులో కరపత్రం అందించిన పార్టీ నాయకులు


పోలసానిపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న ప్రజాప్రతినిధులు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దెందులూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నాలుగేళ్లుగా గడపగడపకు అందిస్తున్న సంక్షేమ లబ్ధిపై లబ్ధిదారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు అన్నారు. ముప్పవరం పంచాయతీలో సర్పంచ్ మెండెం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. వైఎస్సార్ సీపీ శ్రేణులు సంక్షేమ పథకాల అమలు తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకుని వారి అభిప్రాయాన్ని నమోదు చేశారు. లబ్ధిదారుల అనుమతితో వారి ఇంటి తలుపులపై జగనన్న స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ప్రత్తిపాటి లక్ష్మణరావు, ఉపసర్పంచ్ ముకుందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.కుటుంబరావు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు. దెందులూరులో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, మహిళా అధ్యక్షురాలు తొత్తడి వేదకుమారి, సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, ఎంపీటీసీలు తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, తాళ్లూరి నాగరాజు, తొత్తడి కృష్ణ, గృహసారథులు, వలంటీర్లు సర్వే నిర్వహించారు. లబ్ధిదారులకు కిట్లను అందచేశారు. సీతంపేట, శ్రీరామవరం, గోపన్నపాలెం, జోగన్నపాలెం, నాగులదేవునిపాడు, పోతునూరు, కేదవరం, రామారావుగూడెం, చల్లచింతలపూడి, దోసపాడు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.

ప్రతి ఇంటా జగనన్నే మా భవిష్యత్

పెదవేగి : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగనన్న నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీరమాచినేని నాగబాబు అన్నారు. మండలంలోని బాపిరాజుగూడెంలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గృహసారథులు, వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి లబ్ధిదారుల అనుమతితో ఇంటి తలుపులకు స్టిక్కర్లు అతికించారు. పినకడిమి, విజయరాయి గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాలనలో అర్హత ఉంటే ఎలాంటి సిఫార్సు లేకుండా సంక్షేమ పథకాలు ఇంటికి వస్తున్నాయన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

భీమడోలు: జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి భీమడోలు, పోలసానిపల్లి, గుండుగొలను, పెదలింగంపాడు ఏరియాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయం సేకరించారు. సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్, ఎంపీటీసీ అంబటి దేవీ ప్రసాద్, మండల సచివాలయాల కన్వీనర్లు మద్దుల రాజాలు పోలసానిపల్లి బీసీ కాలనీలో ప్రచారం చేశారు. పార్టీ పుస్తకంలోని ఐదు ప్రశ్నలను లబ్ధిదారులను అడిగి పూర్తి చేశారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు మిస్డ్ కాల్ చేశారు. పెదలింగంపాడులో సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మాజీ ఎంపీటీసీ గూడెల్లి అవ్వమ్మ, నాయకురాలు ప్రత్తిపాటి కుమారి, గొల్ల మోజేస్, యర్లపాటి రవీంద్ర తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై వివరాలు సేకరించారు. గుండుగొలనులో ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వాడవాడలా జగన్నే మాకు అండగా అంటూ ప్రజలు తమ అభిమానాన్ని వ్యక్తం చేస్తున్నట్టు ప్రజాప్రతినిధులు, నాయకులు తెలిపారు.

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం గ్రామాల్లో జోరుగా నిర్వహిస్తున్నారు. చేబ్రోలు, నారాయణపురం, ఉంగుటూరు, కైకరం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయం సేకరిస్తున్నారు. చేబ్రోలులో మాజీ సర్పంచ్ కరణంబుజ్జి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, ఆకుల రాజ తదితరులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నారాయణపురంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, ఉప సర్పంచ్ అడపా శ్రీను, పార్టీ గ్రామ అధ్యక్షుడు పైడి అరుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విశేషాలంకరణలో నాగాశ్వని పేరంటాలమ్మ


నాగాశ్వని పేరంటాలమ్మ తల్లి

దెందులూరు : గాలాయగూడెం గ్రామ దేవత నాగాశ్వని పేరంటాలమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ పూజారి అన్నవరం, దుర్గా దంపతులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని గురువారం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి ఆలయ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు అగ్నిగుండ ప్రవేశం, సాయంత్రం అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పూజారి శ్రీనివాసరావు, ఏనుగు రామకృష్ణ, తుంగా రాము, గంటా సుబ్బారావు, మహంకాళి, పెద్దిశెట్టి నాని తెలిపారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

పెదవేగి : పదో తరగతి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తున్నారని ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ అన్నారు. గురువారం కొప్పాక పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో పరీక్షల ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్ర పరిసరాల పరిశుభ్రత, తాగునీటి ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 174 మందికిగాను నూరుశాతం విద్యార్థుల హాజరవుతున్నారని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, కానిస్టేబుల్, మహిళా సంరక్షణ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్‌కు గాయాలు

పెదపాడు : ఆగిఉన్న లారీని ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాళ్లమూడి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో విజయవాడ వైపు నుంచి ఏలూరు వైపునకు వెళ్తున్న బొలెరో వాహనం లారీని ఢీకొంది. ఈఘటనలో డ్రైవర్ సైదు రాములుకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుమేరకు ఎస్సై బి.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

ఉంగుటూరు: నారాయణపురం మెట్టప్రాంతంలో శుక్రవారం నుంచి ఈనెల 18 వతేదీ వరకు లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలకు చైర్మన్ పత్సమట్ల ధర్మరాజు పోటీలను ప్రారంభించనున్నారు. రోజుకు 4 టీములు చొప్పున లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చారు. ఆఖరి రోజున విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

నీటి సమస్య పరిష్కారం

పెదవేగి : పెదవేగి మండలం గార్లమడుగు పంచాయతీ పరిధిలోని కల్లెపల్లెవారిగూడెంలో మరమ్మతుకు గురైన మోటార్‌ను బాగుచేయించారు. పంచాయతీ మోటార్ మరమ్మతుకు గురవడంతో గ్రామస్తులు ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాలతో సర్పంచ్ జిజ్జువరపు నాగరాజు 24 గంటల్లో మోటారుకు మరమ్మతులను చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. వెంటనే సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే, సర్పంచ్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు: భారతరత్న బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ భీమడోలు మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు తెలిపారు. పాత అంబర్‌పేటలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే వాసుబాబు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. భీమడోలు మసీదులో సాయంత్రం 6 గంటలకు మత పెద్దల సారథ్యంలో నిర్వహించే ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే వాసుబాబు హాజరవుతారని మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ హసేనా తెలిపారు. చెట్టున్నపాడులో రాత్రి 7 గంటలకు జరిగే అంబేడ్కర్ ఉత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్పొరేషన్ డైరెక్టర్లు విధిగా హాజరు కావాలని కోరారు. ఉదయం 9 గంటలకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆర్జావారిగూడెంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని సత్యశ్రీనివాస్, నాగేశ్వరరావు తెలిపారు.

నిడమర్రు మండలంలో..

నిడమర్రు: మండలంలోని పెదనింద్రకొలనులో శుక్రవారం ఉదయం 8 గంటలకు నిర్వహించే అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారు. 8.30 గంటలకు పెదనింద్రకొలను గ్రామ సచివాలయం-1 పరిధిలో తుమ్మలచెర్వుగట్టు ఏరియాలో మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొంటారు. 11.30 గంటలకు గణపవరం టౌన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఉంగుటూరులో, 5 గంటలకు కైకరంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

అసమానతలను రూపుమాపాలి


మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాస్

గణపవరం: నానాటికీ పెరిగిపోతున్న ఆర్థిక, సాంఘిక అసమానతలను రూపుమాపేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని కేరళ కేడర్ ఐఏఎస్ విశ్రాంత అధికారి బండ్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్సు విభాగం ఏర్పాటుచేసిన సామాజిక అంశాలు, అధ్యయనం, ఆచరణ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో 43 శాతం సంపదంతా ఒకశాతంగా ఉన్న సంపన్నుల చేతిలో ఉందని, 50 శాతం ప్రజలకు 2 శాతం సంపద మాత్రమే చేరుతుందని చెప్పారు. అత్యంత సంపన్నులైన 10 శాతం మంది నుంచి కేవలం 4 శాతం జీఎస్టీ వసూలవుతుండగా, అట్టడుగునున్న 50 శాతం ప్రజల నుంచి 64 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ అసమానతలే దేశంలో తీవ్ర సమస్యలకు దారితీస్తున్నాయన్నారు. దేశంలో ఆర్థికాభివృద్ధి జరుగుతున్నా ఇంకా 60 నుంచి 70 శాతం ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలను అధ్యయనం చేసి, వాటిని పరిష్కరించే తత్వం అలవర్చుకోవాలన్నారు. ప్రముఖ సామాజికవేత్త డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ జీవన వాస్తవాలను నిరంతరం అధ్యయనం చేయాలని విద్యార్థులకు సూచించారు. ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ సంచలనాలకోసం మీడియాలో చెడుకు లభిస్తున్న ప్రాధాన్యత మంచికి దొరకడంలేదన్నారు. ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, ఐక్యు కోఆర్డినేటర్ టి.అక్కిరాజు, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ కె.స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సమస్యలపై ప్రణాళిక

దెందులూరు : గోపన్నపాలెం గ్రామంలోని నూతన జగనన్న కాలనీ (దుగ్గిరాల ఎస్టేట్)ను బుధవారం జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, గ్రామ సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు వీరంకి సత్యనారాయణ, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, ఉపసర్పంచ్ హేమసాగర్, గృహసారథులు, వలంటీర్లతో కలిసి పరిశీలించారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతన జగనన్న కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాలకు అనుగుణంగా తొలి ప్రాధాన్యతగా ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి యోహోషువా, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలు


సూరప్పగూడెంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

భీమడోలు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలు మండలంలో గురువారం ప్రారంభమయ్యాయి. గుండుగొలను నెం.1 ప్రాథమిక పాఠశాల, అన్నేవారిగూడెం యూపీ పాఠశాలల్లో హెచ్‌ఎంలు పాశం పాండురంగారావు, ఎస్‌కే మస్తాన్‌లు బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. స్వీట్లు పంచారు. సూరప్పగూడెంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే జయంతి వేడుకలను గురువారం రాత్రి ప్రారంభించారు. గ్రామ వీధుల్లో తీన్‌మార్ డప్పులతో ఊరేగింపు నిర్వహించారు. విద్యార్థులకు గేమ్స్, వివిధ రకాల పోటీలను నిర్వహించారు.

అంబేడ్కర్‌ని ఆదర్శంగా తీసుకోవాలి

ఉంగుటూరు: బీఆర్ అంబేడ్కర్‌ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు తమ జీవితాలను ఉన్నతంగా మలుచుకోవాలని ఎ.గోకవరం సర్పంచ్ మిద్దే సత్యవతి సూచించారు. ఎ.గోకవరం ఎంపీయూపీ పాఠశాలలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎస్‌ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ఉంగుటూరు : బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు తమ జీవితాలను మలుచుకోవాలని ఎస్‌ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు అన్నారు. కళాశాలలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఎస్.పావని, కె.వనజ, హస్తమ దర్గా భారతి, కళ్యాణి, రుషి అంబేడ్కర్ జీవిత ఘటాలపై ప్రసంగించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిసి రెడ్డియ్య, ఐక్యు కోఆర్డినేటర్ డా.కొండరవి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు నిర్మల జ్యోతి, రసాయన శాస్త్ర విభాగం అధ్యక్షులు ఎఫ్సి బా అంబేడ్కర్ సేవలను కొనియాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గుండుగొలనులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం పాండురంగారావు


ఎ.గోకవరం పాఠశాలలో మాట్లాడుతున్న సర్పంచ్ సత్యవతి

ఆపత్కాలంలో ఆదుకోవాలి


ఆపద మిత్రలకు కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

భీమడోలు: క్షేత్ర స్థాయిలో ఆపత్కాలంలో ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ఆపద మిత్రలదేనని ఎంపీడీఓ జీఎల్ఎన్వీ రాఘవన్ అన్నారు. భీమడోలు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో శిక్షణ పొందిన 20 మంది ఆపద మిత్రలకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాఘవన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రకృతి వైపరీత్యాలు, భూకంపాలు, సునామీలు, అగ్ని, గ్యాస్, రోడ్డు ప్రమాదాలు, పాము కాట్లు, కాలువలో మునిగిపోవడం వంటి ప్రమాదాలు సంభవించినప్పుడు వారికి ఆపద మిత్రలు తగు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కిట్లలోని 16 వస్తువులను అవసరం మేరకు వినియోగించాలన్నారు. గ్రామ పంచాయతీల వద్ద ఆపద మిత్రల సెల్ ఫోన్ నెంబర్లను ప్రదర్శించాలని అన్నారు. పీఆర్ ఏఈ డి.సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ శంకర్, ఆపదమిత్రలు పాల్గొన్నారు.

అండర్ పాసు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలి

భీమడోలు: జాతీయ రహదారి కొమిరేపల్లి వద్ద అండర్ పాసు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల అధ్యక్షుడు టి.సుమన్ బాబు కోరారు. గుండుగొలనులో గురువారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం సమావేశం నిర్వహించారు. సుమన్‌బాబు మాట్లాడుతూ జాతీయ రహదారిపై రాంగ్‌రూట్ ప్రయాణం వల్ల తరచుగా ఎందరో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయని, ఎందరో క్షతగాత్రులవుతున్నారని తెలిపారు. ఎంతో కాలంగా కొమిరేపల్లి గ్రామస్తులు పోరాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొమిరేపల్లికు చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో ఇకనైనా సంబంధిత నేషనల్ హైవే ఆథారిటీ అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు. మృతి చెందిన యువకుని కుటుంబానికి రూ.20 లక్షల పరిహారంతో పాటు ఆ కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. కొమిరేపల్లి వద్ద జరిగిన రాస్తారోకోను పోలీసులు సామరస్యంగా పరిష్కరించుకుండా దళితులపై లాఠీ ఛార్జి చేయడం సరికాదని తెలిపారు.

నాణ్యమైన విద్య అందించాలి


నియామక పత్రాలు ఇస్తున్న ఎంఈఓ శేషు

నిడమర్రు: నిడమర్రు మండలానికి నూతనంగా వచ్చిన 10 మంది ఉపాధ్యాయులకు గురువారం ఎంఈఓ పుచ్చల శేషు నియామక పత్రాలు అందజేశారు. 1998 డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం ఇటీవల పోస్టింగ్‌లు ఇచ్చిన విషయం విదితమే. వీరిలో నిడమర్రు మండలానికి 10 మంది ఉపాధ్యాయులు ఆప్షన్ ఇచ్చారు. వీరి రాకతో మండలంలో కొంతవరకు ఉపాధ్యాయుల కొరత తీరిందని, నూతన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గుణదల(విజయవాడ తూర్పు): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఏలూరు జిల్లా పెదవేగి మండలం పినకడిమి ప్రాంతానికి చెందిన బొబ్బా అనిల్ కుమార్ ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఏడాది క్రితం భార్య చనిపోగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుమారు ఐదురోజుల క్రితం వ్యక్తిగత పనుల నిమిత్తం విజయవాడకు వచ్చిన అనిల్ కుమార్ గవర్నర్ పేటలోని ఓ లాడ్జిలో రూమ్ తీసుకుని ఉన్నాడు. ఈ నెల 11వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో అతడు అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గమనించిన లాడ్జి నిర్వాహకులు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 12వ తేదీ అర్ధరాత్రి 2 గంటల సమయంలో మృతి చెందాడు. అనిల్‌కుమార్ సోదరుడు కిషోర్ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు వివరాలు సేకరించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా గత కొంతకాలంగా అనిల్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కిషోర్‌బాబు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రేపు దెందులూరు రైల్వేగేటు మూసివేత

దెందులూరు : ఏలూరు – దెందులూరు మధ్య ఉన్న రైల్వే గేటును ట్రాక్, గేటు మరమ్మతుల నిమిత్తం ఈనెల 15వ తేదీన మూసివేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే డీఈ వెంకటేశ్వరరావు తెలిపారు. మరమ్మతులు పూర్తయిన తరువాత గేటు తెరవబడుతుందని, గేటు లోపల నుంచి ప్రయాణం చేసే సమీప గ్రామాల ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని డీఈ కోరారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

పెదవేగి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. బాపిరాజుగూడెం సచివాలయాన్ని ఎంపీడీఓ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు అందించారు. విధి నిర్వహణలో సమయాన్ని పాటించాలన్నారు. గ్రామంలో ఉపాధి పని జరగడం లేదని, పని కల్పించాలని స్థానిక మహిళలు కోరడంతో పని ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఉంగుటూరు: ఉంగుటూరు, నారాయణపురం గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ఉంగుటూరు అటవీప్రాంతంలో నిర్వహిస్తోన్న ఉపాధి పనులను లో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచ్ బండారు సింధు పరిశీలించారు. నారాయణపురంలో ఎంపీటీసీ సభ్యుడు బండారు నాగరాజు ఇతర ప్రజాప్రతినిధులు ఉపాధి పనులు పరిశీలించారు.

ప్రజలపై భారాలు మోపిన ప్రధాని మోదీ

గణపవరం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేటు సంస్థల అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావా లని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా వామపక్షాలు ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం గణపవరం మండలం కోమట్లపాలెం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జక్కంశెట్టి మాట్లాడుతూ కేంద్రంలో రెండో సారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రజలపై మోయలేని భారాలు మోపారన్నారు. మోదీ పాలన నుంచి విముక్తి కల్పించడమే మనందరి లక్ష్యం కావాలన్నారు. నాయకులు పెచ్చెట్టి నర్సింహమూర్తి, నరాలశెట్టి రామకృష్ణ, ఎం.పెంటారావు, సంజీవరావు, గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

నిడమర్రు: నిడమర్రు మండలం పెదనింద్రకొలను, చిననింద్రకొలను గ్రామాల్లో రేషన్ షాపులపై ఏలూరు విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పెదనింద్రకొలను నెం.4 షాపులో 730 కిలోల బియ్యం, 20 కిలోల పంచదార ఎక్కువగా, నెం.5 షాపులో 1335 కిలోల బియ్యం, 19 కిలోల పంచదార తక్కువగా, చిననింద్రకొలను షాపునెం.10లో 1242 కిలోల బియ్యం తక్కువగా, 70 కిలోల పంచదార ఎక్కువగాను ఉన్నట్టు గుర్తించారు. ఎండీయూ వాహనం-2లో 533 కిలోల బియ్యం, 31 కిలోల పంచదార స్టాకు కన్నా తక్కువ ఉన్నట్టు గుర్తించి, బాధ్యులపై 6ఎ కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్సైలు రంజిత్‌కుమార్, నాగరాజు, ఆర్ఐ ఆర్.సుబ్బారావు, వీఆర్‌ఓలు సీహెచ్ రాంబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం సీజ్

ఉంగుటూరు: ఇరగవరం మండలం కొడవలి శివారు ఖండ్రికకు చెందిన అద్దాల నరసింహారావు పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా కాగుపాడులో రెవెన్యూ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. 250 కేజీల పీడీఎస్ బియ్యం సీజ్ చేశారు.